# అమల

మాయింటి చుట్టూ ప్రపంచం చకచకా పరుగెత్తుతూ వుంటుంది. బాల్కనీలో నుంచీనో, కిటికీలోనుంచీనో పైకి తొంగిచూస్తే తప్ప బెత్తెడంత ఆకాశంకూడా కనిపించదు మాకు. మా అయిదంతస్థుల భవంతిలో ఇరవై సంసారాలు కాపురముంటున్నారు. మాకు కుడిప్రక్కన రైల్వేలైన్లు, వెనుకగా రైల్వేఓవర్ బ్రిడ్జి, ఎదురుగా రోడ్డుదాటగనే వర్క్‌షాపు, ఎడంప్రక్కన సరిగ్గా మా భవంతి లాంటిదే మరో భవంతి వున్నది. అరగంటకోసారైనా ఒకరైలు పెద్దగా కూతలు పెట్టుకుంటూ రొదచేస్తూ పోతుంది. ఓవర్‌బ్రిడ్జిమీద వివిధవాహనాలు రకరకాల హారన్ల శబ్దాలతో నిరంతరం పోతూనేవుంటాయి. వర్క్‌షాపు షిఫ్టుల్లో వుదయం ఆరునుంచీ రాత్రి పదివరకూ పనిచేస్తుంది.

తీరిక ఎరుగని యీ నాగరక ప్రపంచంలో రోజులు గడియారపు ముళ్ళలాగే, క్రమం తప్పకుండా, ఒకరోజుకీ మరోరోజుకీ మధ్యన ఏవిధమైన భేదంలేకుండా దొర్లిపోతూ వుంటాయి. దానిని 'యాంత్రిక జీవితం' అని ప్రత్యేకంగా నేను ఏమీ అనుకోలేదు. ఎందుకంటే యీ ప్రపంచంలో యంత్రం కానిది ఏమన్నా వుంటుందా!

ఒకసారి నాలుగురోజులు వరుసగా సెలవలు వచ్చాయి. ఊళ్ళు, పిక్నిక్‌లు అంటూ భవంతుల్లోని కుటుంబాలు చాలవరకు వెళ్ళిపోయారు. నా భర్త రమణ్ అజంతా గుహలు చూద్దామన్నాడు. నేను ఎందుకులే అనేశాను. ఎక్కడికో వెళ్ళామనీ, ఏదో చేశామనీ అనుకోవడం – ఏం

ప్రయోజనం? — శుష్క ప్రయాస! అప్పటికే నాకు ప్రపంచమూ, మనిషి చెయ్యగల పనులూ అర్థశూన్యంగా, శవాల కదలికల్లాగా కన్పించడం ప్రారంభమైనది.

అప్పుడు అన్నిరోజుల్లాకాని ఒకరోజు వచ్చింది. వర్క్‌షాపు మూతవేశారు. ఓవర్‌బ్రిడ్జిమీద కూడా ఎక్కువ రద్దీలేదు. రైళ్ళసంఖ్య కూడా తగ్గినట్లుంది. ఒక రైలు రాకకీ, మరో రైలు రాకకీ మధ్యనున్న నిశ్శబ్దం దీర్ఘమైంది. నిశ్శబ్దంలో వుండివుండి పుట్టే ధ్వనులు.... విచిత్రమైన, చావులాంటి నిశ్శబ్దం.

ఈ నిశ్శబ్దాన్ని నేను భరించలేకపోయాను. నా మనసునిండా హోరు. ఏదో చెయ్యాలన్న తొందర, తొందర, తొందర. నేనేం చేస్తున్నానో నాకే తెలియకుండా అయిపోయింది. మా కారు రావటంగాని, రమణ్ యింట్లోకి రావటంగాని నాకు తెలియలేదు. నేను గమనించేసరికి రమణ్ నా ఎదురుగా నిల్చుని, నన్ను విచిత్రంగా చూస్తూ వుండడం కన్పించింది. "ఏమిటలా నిల్చున్నావ్? తొందరగా పరుగెత్తు' అన్నాను ప్రోత్సాహకరమైన చిరునవ్వుతో. ఆ మనిషిలో కదలిక అనేది వుంటేనా? 'తొందరగా, తొందరగా' అని తొందరించాను. అప్పటికి కదిలాడు. ఎవరెవరో వచ్చారు. ఎక్కడికో పోయాము. తొందర తొందరగా వెళ్ళమని చెబుతూనే వున్నాను నేను....

వెనుకవన్నీ జ్ఞాపకం చేసుకుంటే యిప్పుడు నాకు నవ్వొస్తుంది. నా ప్రవర్తనలో పొరపాటు వుందనికాదు. కానేకాదు .... ప్రపంచం ఎప్పుడూ పరుగెత్తుతూనే వుంటుంది. దానికడుపునిండా తొందరే. కాని ఆ నిజం నేను చెప్పిన వైనమే తమాషా....

రమణ్ నన్ను సైకియాట్రిస్ట్ దగ్గరకు తీసుకెళ్ళాడు. ఆ డాక్టరు మాకు తెలిసినవాడే. మంచివాడు. అతని మాటల్నిబట్టి నేను గ్రహిం

చిందేమంటే – నాకున్నది వుత్తన్యూరోసిస్, కనుక కొంత సెడేషన్‌తో పాటు సైకో ఎనలిటిక్ ట్రీట్‌మెంట్ యివ్వాలనుకుంటున్నాడని. నేను యిదివరకే యీ సంబంధమైన పుస్తకాలు చదివాను. కాని యిప్పుడు నేను రోగిని. కాసేపు డాక్టరుతో చచ్చు కబుర్లు మాట్లాడి రావటమే నా పని. అతను చెప్పే మాటలు పెద్దజబ్బుల్ని నయం చెయ్యగల గొప్ప విషయాలేమీకాదు. కావాలనుకున్న పదార్థాలే తినాలట. వాటిని 'నేను ఫలానాది తింటున్నాను' అనుకుంటూ ఆనందంగా నమిలి తినాలట. తింటున్నపుడు పుస్తకాలు చదవటం, పాటలు వినటం లాంటి పనులు చెయ్యగూడదట. స్నానం చేస్తున్నపుడు నీళ్ళవేడికి ఒంట్లో నెత్తురు పరుగెత్తుతూ, హాయిగా ఒళ్ళు తేలిక పడుతూంటే, నిదానంగా పోసుకోవాలట....అతనిమాటలకు అతనిఎదురుగా నేను నవ్వలేదు. అన్నీ మాటలు! వుత్తమాటలు ! వూరికే అట్లా మాట్లాడాలి !

ఇవాళ ప్రపంచం చురుగ్గా చాల గొడవ గొడవగా వుంది. రమణ్ ఎవరో స్నేహితులింటికి వెళ్ళాడు. రైళ్ళు గబగబా పోతున్నాయి. ఓవర్ బ్రిడ్జి మామూలు రద్దీతో పగిలిపోతున్నది. వర్క్‌షాపు నిర్విరామంగా ధణధణలాడుతున్నది.

తొందర. తొందర. పరుగు. పరుగు....

ఆ తొందరా, పరుగూ నాగుండె మీదికి పాకాయి. బరువు, ఆవేశం ఆయాసం. కళ్ళు మూసుకుని సోఫాలో కూర్చుండిపోయాను.

నేను కళ్ళు తెరిచేసరికి ఒక పారదర్శకమైన, లేత నీలపుగోళంలో వున్నాను. అది లేత ముంజెతోనో, ఆకాశంతోనో చేసినట్లుంది. అక్కడ కాలం, చలనం, శబ్దం లేవు. సంపూర్ణమైన ప్రశాంతత, నిశ్చలత

వున్నది....ఇది నా చుట్టూ ఏర్పడిందా? లేక నేను ఎలానో ఇందులోకి వచ్చిపడ్డానా? ఇందులోంచీ బయటకి పోవటానికి మార్గం వున్నదా?

దేనికీ సమాధానం దొరకలేదు.

సరే, ఎలాగూ ఇందులో కొచ్చాను. ఈ లోకంసంగతీ చూద్దామని అనుకున్నాను. చాల దగ్గరగా నన్ను చుట్టినట్లున్న ఆ గోళాన్ని తాకి చూద్ధామని చెయ్యిచాచాను. అందలేదు. ఒంగినా అందలేదు. ఇలా ప్రయోజనం లేదని లేచాను, దాని దగ్గరకు వెళ్దామని. నేను ఎంతదూరం నడిచినా అది అందకుండానే వుంది! చుట్టూ నడిచి, నడిచి యిహ లాభం లేదని కూర్చున్నాను.

నేను, నా చుట్టూ నా గోళం.

విచిత్రమేమంటే, నాకేమీ భయం వెయ్యటంలేదు. ఇదంతా నా సొంతమైనట్లూ, ఇక్కడ నేను సర్వ స్వతంత్రురాలినైనట్లూ అనిపిస్తున్నది.

నిదానించి గమనించగా యీ నిశ్శబ్దంలోనికీ ఎక్కడో దూరాన్నుండి శబ్దాలు — రైళ్ళు, బస్సులు, మోటార్లు, వర్క్‌షాపులు లీలగా వినిపిస్తూనే వున్నవి. అయితే అవి మామూలుగా వినిపించే శబ్దాలు కావు. ఈ నిశ్శబ్ద రంగంలోకి వస్తున్న, స్ఫుటమైన, దేనికదే ప్రత్యేకమైన శబ్దాలు. అవి వాటిపాటి కవి వస్తున్నవి, పోతున్నవి. వాటి నెవరూ పట్టుకోవటంలేదు.

ఇక్కడ మరో విచిత్రం యీ వెలుగు. దేనినైనా చూడాలనుకున్నప్పుడు అది కాంతివంతమై అన్నిటినీ చూపెడుతున్నది. అవసరం లేనప్పుడు దానంతటి కదే తగ్గిపోయి లేవెలుగుగా మారిపోతున్నది.

ఈ లోకం నాకు అర్థంకాలేదు. నేను నాగరకప్రపంచపు తెలివి నుంచీ యీ నిశ్చల ప్రపంచపు స్తబ్ధతలోకి వచ్చానా? లేక.... 'నేను' నేను కాదా?

అసలు 'నేను' అంటే ఏమిటి?

కొంచెంసేపు ఆలోచించి ప్రయోజనం లేదని ఒదిలేశాను.

ఏది ఏమైతే ఏమిటి? నాకిక్కడ హాయిగా, సుఖంగా వున్నది!

అలానే కూర్చుండిపోయాను.

రమణ్ వచ్చాడు. నేను నా ప్రపంచంలో చాల దూరాన, చాల లోపలగా వున్నాను. అయినా కన్పించాడు. 'ఏమిటలా కూర్చుండి పోయావ్. వంట చెయ్యలేదా?' అన్నాడు. ఆ మాటలు స్పష్టంగా విన వినపడ్డాయి నాకు.

నేను చాల దూరాన వున్నట్లు అతనికి తెలిసినట్లు లేదే! నాకు కన్పిస్తున్నది అతనికేమీ కన్పించటం లేదా?

రమణ్ రాకతో నా ప్రశాంతత కరిగిపోతున్నది. నా గోళం మరింత పారదర్శకమై సమసిపోతున్నది.

'నేను యిక్కణ్ణుంచీ బయటకు రాలేను' అన్నాను.

'రాలేకపోవటం ఏమిటి?....సరే, యివాళ్టికి హోటల్లో భోం చేద్దాం, రా' అన్నాడు.

అతనలా అనగానే బయటకు వెళ్ళగలనని నాకూ తెలిసిపోయింది. కళ్ళు తెరిచి బయట కొచ్చేశాను.

కాని నాకు జరిగిన అద్భుతం గురించి రమణ్‌తో చెప్పలేక పోయాను. ఇది నిద్రలాగా నాకే ప్రత్యేకమైనది. నాది. మరొకరితో పంచుకునేది కాదు. ఇంకొకరికి చెప్పే విషయమూ కాదేమో!

నాకిప్పుడు రెండు లోకాలున్నాయి, రెండూ పూర్తిగా భిన్నమైనవి. నేను ఒక లోకంనుంచీ మరో లోకంలోకి వెళ్తూనే వున్నాను. నిజానికి 'వెళ్ళటం' అనేది అర్థంలేని మాట. నేను చాలా దూరంగా వుండీ దగ్గరగా వుంటాను. దగ్గర వుండీ దూరంలో వుంటున్నాను. నేను యీ లోకంలో వున్నా, ఆలోకపు ప్రశాంతిఛాయ నాలో వుంటూనే వున్నది. తొందర అనేది ఎక్కడో జారిపోయింది. నాకసలు ఏపనీ చెయ్యాలని వుండదు. పని చెయ్యడం శ్రమ. దండగ శ్రమ. దేనికీ విలువ, ప్రయోజనం లేవు! నేను క్రమంగా ఒక నిరంతర నిశ్శబ్దంలోనికి మునిగిపోతున్నాను. కాదు. శబ్దంలోనుంచీ పైకి తేలుతున్నానేమో! ఏదైతే ఏమిటి? ఇక్కడ నేను స్వతంత్రురాలిని. బరువు, బాధ్యతలు లేని స్వేచ్ఛాజీవిని!

'ఇదివరకటి చురుకూ, చాకచక్యమూ లేవు. మనిషి చాలా చప్పబడిపోయింది, పాపం!' రమణ్ చెల్లెలు చిత్ర అంటువున్నది.

చిత్ర నాకంటే కొంచెం పెద్దది. నేను బొంబే వచ్చినప్పటినుండి మేమిద్దరం కలసి మెలసి వుంటున్నాం. ఆమె భర్త ఒక కంపెనీలో మేనేజరు. మాకు ఎడంప్రక్క భవంతిలోనే ఒక భాగంలో వాళ్ళుంటున్నారు. మేమిద్దరం చాల పనులు కలిసి చేశాము. మా మధ్యన ఎప్పుడూ పోటీనే.

చిత్ర కూతుళ్ళిద్దరూ మంచి కాన్వెంటులో చదువుతున్నారు. సంగీతం, డాన్సు, యీత నేర్చుకున్నారు. పెద్దమ్మాయి ఇంగ్లీషు నాటకాల్లోనూ, రెండో అమ్మాయి చిత్రలేఖనంలోనూ ప్రత్యేకత చూపిస్తున్నారు.

ఇక్కడి మిగతా కుటుంబాల పిల్లల్లాగా వాళ్ళు ప్రతిభావంతులుగానే వున్నారు.

చిత్ర కూడా క్షణం వూరుకునే మనిషికాదు. ఫాబ్రిక్ పెయింటింగ్, బేకరీ, ఫ్లవర్ ఎరేంజ్‌మెంట్, స్వీట్స్ అండ్ డెస్సర్ట్స్, ఎంబ్రాయిడరీ కోర్సులు చేసింది. ఇంటీరియర్ డెకరేషన్ డిప్లొమాకు చదువుతున్నది. నేనూ చిత్రతోపాటే అన్ని కోర్సులూ చేశాను. అన్నింట్లోనూ తనకంటే ఎక్కువ సామర్థ్యం చూపించాను. ఇంటీరియర్ డెకరేషన్‌కు పోకుండా యిలా నిలిచిపోయాను.

చిత్ర నన్ను గురించి జాలిపడటం నాకు అసలు నచ్చలేదు. గబుక్కున కోపం వచ్చింది. ఆవిడ గొప్పదనం ఏమిటి? నా సంగతి వాళ్ళకేం తెలుసు? ఒక మహత్తర లోకంలోకి నాకు ప్రవేశం వుందని వాళ్ళకు తెలియదు. వాళ్ళ జీవితం ఎంత నిస్సారమైందో వాళ్ళు గ్రహించలేరు!

ఏదో బరువు నాలో పుట్టి ఆత్రంగా, గజిబిజిగా అల్లుకుపోతున్నది.... ఆవేశం, ఆయాసం పైకి వస్తున్నవి. కళ్ళు మూతలు పడిపోయినై. ఏదో సుఖంలోకి జారిపోయాను.... లేవెలుగు చిక్కనై సాంద్రమైంది. ఒక నిశ్శబ్ద నిశ్చల మహాసముద్రం కనిపించింది.... శబ్దం,చలనం అందులోని తరంగాలు .... ఈ సముద్రంలో సుఖం .... సుఖం .... ఎంత హాయిగా వుంది!....

డాక్టరుగారు ఏం చెప్పారంటే, మనస్సు స్వరూపం పరిసరాలమీద ఆధారపడి వుంటుందట. ఒక చిత్రం చూపించారు. నల్లని బాక్‌గ్రౌండ్ నడుమ తెల్లని చిత్రం. నలుపు బాక్‌గ్రౌండ్ అనుకుంటే చిత్రం ఒక

ఆకారంలో వున్నది. నలుపే ఆకారమనుకుంటే చిత్రం మరో అర్థంలో కనిపిస్తున్నది.

'మీరు చెప్పేది గెస్టాల్ సైకాలజీ. ఇటువంటి బొమ్మలు వారపత్రికల్లోకూడ వస్తుంటాయి. మేము చిన్నప్పుడు యిట్లాంటివి వేసేవాళ్ళం' అన్నాను విసుగ్గా.

అతను చెప్పేవన్నీ నాకు తెలుసు! అవన్నీ ఇదివరలో నేను చదివినవే. నాకు పరిష్కారంకాని విచిత్రమైన సమస్య ఒక్కటే వున్నది - గోళం లోపలుండే నేను నిజమా? లేక బయటుండే నేను నిజమా?

* * *

రమణ్‌రావు భార్య అమల బాగా చదువుకున్నది. నిశితమైన ఆలోచనా పటిమ గలది. ఆమెకు చాల విషయాలు తెలుసు. అందువలన ఆమె ఆత్మకథ యింతవరకూ చెప్తూవచ్చిన విధంగా సాగివుండవచ్చునేమో, ఆమెకు ప్రమాదం జరిగి వుండకపోతే....

కాని అలా జరగలేదు.

అమల చాలా నిదానస్తురాలు. ఆమె చిన్నపిల్లగా వున్నప్పుడు 'ఎందుకంత మందకొడిగా వుంటావు? ఎవరైనా నిన్ను మందమతి అనుకుంటారు' అని చాలసార్లు విసుక్కునేది వాళ్ళమ్మగారు. అమల తనంత తానుగా ఏ పనీ చేసేదికాదు. స్తబ్దంగా వుండిపోయేది. కాని ఏ పనినైనా ప్రారంభిస్తే దానిలో మంచి బుద్ధి నైశిత్యం కనిపించేది. ప్రతివిషయంలోనూ తనకు తోచినట్లు చేసేదే గాని ఎవరు ఎంతగా చెప్పినా మరోవిధంగా చెయ్యని మూర్ఖపు పట్టుదల వుండేది. క్రొత్తగా

పెళ్ళయి బొంబాయి వచ్చినప్పుడు అక్కడి జీవితపు వేగాన్ని చూచి 'లక్ష్యం లేని పరుగు' అనుకున్నది.

అమలకంటే చాల ముందుగా బొంబాయి వచ్చి, నాగరక ప్రపంచంతో పరుగెడుతున్న చిత్ర అమలను తనతో రమ్మని పిలిచినప్పుడు వెళ్ళలేదు. చిత్రా, నాగరకతా కూడా అమలను ఒదిలేశారు. ఆమె ఒంటరిగా మిగిలిపోయింది.

క్రమంగా ఆనందపూర్ణమైన ఒక అమనస్క స్థితిలోకి జారిపోయింది అమల....

ఇలాకూడా జరిగివుండొచ్చు అమలకు, ఇతరులను లెక్కచెయ్యని గుణం వుండివుంటే....

కాని నిజంగా జరిగింది యీ క్రింది విధంగా వుంది —

అమల స్వభావతః నిదానస్తురాలు. మొదట్లో బొంబాయినగర జీవితపు వేగానికి తట్టుకోలేక బాధపడింది.

చూడటానికి, తెలుసుకోవడానికి, నేర్చుకోవడానికి ప్రపంచంనిండా విషయాలు. చీరలో, కట్టులో, బొట్టులో, తీరులో, మాటలో ఎప్పటికప్పుడు మార్పులు. మేధస్సుకు పదును పెడుతూవుండటం, క్రొత్త ప్రయోజనాలను సాధిస్తూవుండటం యీ కాలపు విలువలు. అలా చెయ్యనివారు జీవంలేని మొద్దులు!

భర్త ప్రోత్సాహంతో, చిత్రసాహచర్యంలో తొందరలోనే ఆ జీవితానికి మానసికంగా అలవాటు పడిపోయింది. ఆమెలో ఒక చిన్న

భేదం మాత్రం ఏర్పడింది. ఎప్పుడైనా ఒకసారి పని మధ్యలో ఆపి శూన్యంలోకి చూస్తున్నట్లు నిలిచేది. మరుక్షణంలోనే తిరిగి మామూలు స్థితికి వచ్చేది. మిగతాగా చాల చురుగ్గా వుండేది.

ఇంటీరియర్ డెకరేషన్ కోర్సులో చేరేరోజు వచ్చింది. చిత్ర వచ్చింది. అమల కాఫీపెట్టి యిస్తానని స్టవ్ దగ్గరకు వెళ్ళింది. 'త్వరగా బయల్దేరాలి, అమల్' అంటూ అక్కడే కుర్చీలో కూర్చున్నది చిత్ర.

అమల అగ్గిపుల్ల గీచింది. కాని స్టవ్ ముట్టించలేదు. మండుతున్న పుల్లను అలాగే పట్టుకుని చెయ్యి దించింది. నైలాన్ చీర ముట్టుకుని నిముషంలో మంటలు అలుముకుపోయాయి. చిత్ర నిస్సహాయంగా కేకలు వేస్తుండగానే అమల భగ్గున మండిపోయింది.

ఆమె కావాలనే ఆత్మహత్య చేసుకుందా? లేక పొరపాటు జరిగిందా? అన్న విషయం తేలలేదు.

అమల చురుకైనదీ, సున్నితమైన మనస్సుగలదీ, దయనీయురాలూ అయిన నాగరక యువతి.